సాక్షి కామారెడ్డి

ఆదివారం । 5 । మే । 2024



బిజినెస్ పాటిల్‌ను కాదు..

తాను బిజినెస్ పాటిల్‌ను కాదని.. ప్రజలకు సేవ చేసే పాటిల్‌నని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ పేర్కొన్నారు.

- IIలో ▸



నిరంతర విద్యుత్ అందించాలి

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్ బాబు సూచించారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
45.4 /21.0

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత బాగా పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హోం ఓటింగ్ ప్రారంభం



కామారెడ్డి క్రైం: హోం ఓటింగ్‌లో భాగంగా కామారెడ్డిలో ఎన్నికల సిబ్బంది శనివారం ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఈసీఐ నిబంధనల మేరకు ప్రక్రియను నిర్వహించారు. ఇళ్లకు వెళ్లి అక్కడ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లను ఏర్పాటు చేసి వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల నుంచి ఓట్లు వేయించారు. ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రెసిడింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్, ఒక పోలీస్, వీడియోగ్రాఫర్‌తో కూడిన బృందం ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటింగ్ ప్రక్రియను వీడియో చిత్రీకరించిందని తెలిపారు. జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గంలో 85 మంది ఎల్లారెడ్డిలో 140 మంది, కామారెడ్డి నియోజక వర్గంలో 114 మంది వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వేయడానికి హోం ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఆదివారం కూడా హోం ఓటింగ్ జరుగుతుందన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి



కామారెడ్డి క్రైం: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి ఓటర్స్ రిజిస్ట్రేషన్, ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఓటింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 4,546 మంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోడానికి గాను ప్రతి నియోజక వర్గంలో ఒక ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. 4, 5 తేదీల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలీసు అధికారులు, 6, 7 తేదీల్లో ఇతర పోలింగ్ సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ రావు, తహసీల్దార్ జనార్దన్ పాల్గొన్నారు.



డేంజర్ బెల్స్..!

46 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రత

- 'ఉపాధి' కూలీని మింగిన ఎండదెబ్బ
- వడగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- జిల్లా అంతటా మరింతగా పెరిగిన టెంపరేచర్

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరిగి జనం అల్లాడుతున్నారు. ముఖ్యంగా రైతులు, ఉపాధి కూలీలు, రోడ్ల వెంట చిరు వ్యాపారాలు చేసుకునేవారు, ఇతర వృత్తులు చేసుకునే వారు వడదెబ్బతో నీరసించిపోయి ఆస్పత్రుల పాలవుతున్నారు. గత పది రోజులుగా జిల్లా అంతటా ఉష్ణోగ్రతలు బాగా పెరగడంతో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే సూరీడు సుర్రుమంటున్నాడు. పది గంటలు దాటితే రోడ్ల మీద తిరగాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్నం పూట అడుగు బయటపెట్టే పరిస్థితి లేదు. శనివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగాయి. పాల్వంచ మండలం ఎల్పుగొండలో 45.9 డిగ్రీలు నమోదైంది. జిల్లా అంతటా పగటిపూట ఎండలతో పాటు వడగాలులు కూడా తోడవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వడదెబ్బ తగలడంతో ఓ ఉపాధి కూలీ ప్రాణాలు కోల్పోయాడు. నాగిరెడ్డిపేట మండలం జప్తిజాన్కంపల్లిలో వారం రోజులుగా క్రమం తప్పకుండా ఉపాధి హామీ పనులకు వెళ్తున్న భూమిని రాములు అనే కూలీ రోజులాగే శనివారం ఉపాధి పనులకు వెళ్లాడు. అందరితో కలిసి పనులు చేస్తున్న రాములు కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు వైద్యుడిని రప్పించి చూపించేసరికి చనిపోయాడు. దీంతో కూలీలు కన్నీరుమున్నీరయ్యారు. కాగా పెరిగిన ఎండల తీవ్రత నేపథ్యంలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకోవాల్సిన జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. దీంతో కూలీలు పిట్టల్లా రాలిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఓ రకంగా జిల్లాలో డేంజర్ బెల్స్ మోగుతున్నాయనే చెప్పాలి.

వరి కోతలు.. ఉపాధి పనులు

వరిని కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాలు వేయించేందుకు రైతులు, కూలీలు ఎండలను లెక్కచేయడం లేదు. ఇదే సమయంలో ఎండలు పెరగడంతో చాలా మంది రైతులు, కూలీలు ఎండదెబ్బతో మంచం పడుతున్నారు. వరి కోయడంతో పాటు ధాన్యాన్ని తూర్పారబట్టి కేంద్రాల వద్ద వరుస క్రమంలో కాంటాలు వేయించాల్సి ఉంటుంది. దీనికితోడు వడ్ల సంచులు రైస్‌మిల్లులకు చేరేదాకా రైతులే బాధ్యత వహించాల్సిన పరిస్థితుల్లో రాత్రింబవళ్లు అక్కడే గడుపుతున్నారు. అయితే తీవ్రమైన ఎండలతో తాగే నీళ్లు వేడెక్కిపోవడంతో చాలామంది సరిపడా నీరు తాగడం లేదని తెలుస్తోంది. దీంతో డీహైడ్రేషన్‌కు గురై నీరసించిపోతున్నారు. అలాగే ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఎండలో పనిచేయడం వల్ల అవస్థలు పడుతున్నారు. ఊరికి దూరంగా పనులు చేయాల్సి ఉంటుంది. వెంట తీసుకెళ్లిన నీళ్లు ఎండలతో వేడెక్కుతున్నాయి. పొద్దున్నే పనులకు వెళ్లినా, ఎండ కూడా పొద్దున ఏడు గంటల నుంచే దంచికొడుతుండడంతో కూలీలు ఎండలోనే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పదేళ్లలో జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు (డిగ్రీలు)

తేది	లొకేషన్	మండలం	ఉష్ణోగ్రత
28.04.2014	సోమూర్	మద్నూర్	44.2
30.04.2015	సోమూర్	మద్నూర్	44.1
17.04.2016	మగ్దుంపూర్	నిజాంసాగర్	48.1
17.04.2017	సోమూర్	మద్నూర్	43.6
30.04.2018	బీర్కూర్	బీర్కూర్	43.5
20.04.2019	మగ్దుంపూర్	నిజాంసాగర్	45.0
24.04.2020	జుక్కల్	జుక్కల్	42.5
20.04.2021	మగ్దుంపూర్	నిజాంసాగర్	41.6
29.04.2022	కొల్లూర్	బాన్సువాడ	44.4
20.04.2023	భిక్కనూరు	భిక్కనూరు	43.8
04.05.2024	ఎల్పుగొండ	పాల్వంచ	45.9




ఏడాదికేడాది పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో గత పదేళ్ల రికార్డులను పరిశీలిస్తే అత్యధిక ఉష్ణోగ్రతలు ఏడాదికేడాది పెరుగుతున్నాయి. 2016లో నిజాంసాగర్ మండల మగ్దుంపూర్‌లో అత్యధికంగా 48.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈసారి ఇప్పుడే 46 డిగ్రీలకు చేరువైంది. ఇలాగే ఎండల తీవ్రత పెరిగితే పాత రికార్డులను తిరగరాసే పరిస్థితి ఉంది. ఇప్పటికే పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం విలవిల్లాడుతున్నారు. పగలు, రాత్రంతా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు నడుస్తున్నాయి. ఎక్కువ సమయం నడవడం వల్ల వేడిగాలి వస్తోంది. దీంతో ఇంట్లో ఉన్నవారికీ వడదెబ్బ తప్పడం లేదు. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వ్యూహాలకు పదును..

- సొంత వ్యక్తుల ద్వారా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సమాచారం తెప్పించుకుంటున్న అభ్యర్థులు
- ప్రచారానికి మిగిలింది ఆరు రోజులే
- పోలింగ్‌కు కౌంట్‌డౌన్ నేపథ్యంలో పార్టీల హడావుడి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి ఆరు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను చేర్చుకునేందుకు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రాధాన్యత నిస్తున్నాయి. ప్రత్యర్థుల బలాలు, బలహీనతలను బేరీజు వేసుకుంటూ ఎదుటి పార్టీ వద్దనున్న ముఖ్య నాయకులను తమ పార్టీలో చేర్చుకునేలా ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నారు. ప్రతిరోజు ప్రచారం ముగిసిన తరువాత తమ సన్నిహితులు, నమ్మకమైన అనుచరులతో కలిసి రాత్రి సమయాల్లో ఎత్తుగడలపై ఆలోచనలు చేస్తున్నారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో త్రిముఖ పోటీ నెలకొనడంతో ఎవరి ఓట్లు ఎటు చీలిపోతాయో, ఎవరి ఓట్లు క్రాస్ అవుతాయో అనే విషయంలో అంతుచిక్కని పరిస్థితి నెలకొంది. త్రిముఖ పోరులో ఎవరి గెలుపోటములను ఎవరు ప్రభావితం చేస్తారనేది అంచనాలకు అందని పరిస్థితి ఏర్పడింది.

▪ నిజామాబాద్‌లో సిట్టింగ్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ మోదీ చరిష్మా, పసుపు బోర్డు విషయంలో మాట నిలుపుకున్నామనే అంశంతో మరోసారి గెలిచేందుకు వ్యహాలు పన్నుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి తన సీనియారిటీతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం అంశంతో పాటు నిజాం షుగర్స్‌ను తెరిపించే ప్రక్రియ ప్రారంభించినట్లు చెబుతూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. బీఆర్ఎస్ నుంచి మాస్ లీడర్‌గా పేరుపొందిన సీనియర్ నేత బాజిరెడ్డి గోవర్ధన్ సైతం త్రిముఖ పోటీలో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు.

▪ ప్రత్యర్థుల వద్ద పనిచేస్తున్న పలువురిని మచ్చిక చేసుకుంటున్న అభ్యర్థులు వారిచ్చే సమాచారం ఆధారంగా ఎప్పటికప్పుడు ప్రణాళికలు రచిస్తున్నారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు మార్చుకుంటూ వస్తున్నారు. ఎక్కడికక్కడ సొంత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించుకుని ప్రణాళికలు మార్చుకుంటున్నారు. త్రిముఖ పోటీ నేపథ్యంలో ఆయా సమీకరణలను సరిచూసుకుంటూ విశ్లేషణలు చేసుకుంటున్నారు. కులసంఘాలతో నిర్వహించిన సమావేశాల్లో వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా, పోలింగ్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా సంఘాలు, వర్గాల్లో ఆలోచనలకు సంబంధించి ఎలాంటి మార్పులు వచ్చాయన్న వివరాలను సైతం సేకరిస్తున్నారు. ప్రత్యర్థి అభ్యర్థుల్లో ఎవరు ఏ వర్గానికి చెందిన ఓట్లను, ఏ మేరకు చీల్చుకుంటారనే విషయమై విశ్లేషణ లు చేసుకుంటూ ముందుకు కదులుతున్నారు. త్రిముఖ పోరులో ఏ అభ్యర్థి ఏ వర్గానికి చెందిన ఓట్లను, ఎంత శాతం చీల్చుకుంటే తమకు ప్రయోజనం కలుగుతుందో, లేనిపక్షంలో తమకు నష్టం కలుగుతుందా అనే లెక్కలతో ఎత్తులు వేసుకుంటున్నారు. పోలింగ్ కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో ప్రతి నిముషాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా అగ్రనేతల పర్యటనల నేపథ్యంలో తగిన హామీలు ఇప్పించుకుని ఓట్లు రాబట్టుకునేందుకు అభ్యర్థులు ప్రణాళికలు రచిస్తున్నారు.

▪ జహీరాబాద్ స్థానం పరిధిలో సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్ బీజేపీలో చేరి హోరాహోరీగా తలపడుతున్నారు. సీనియర్‌నేత సురేశ్ షెట్కార్ గెలుపే లక్ష్యంగా పోరాడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ సైతం త్రిముఖ పోరులో గెలుపే లక్ష్యంగా శక్తివంచన లేకుండా ప్రచారం చేస్తున్నారు. కులసమీకరణలు తమకు మేలు చేసేలా అభ్యర్థులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఇదిలా ఉండగా ఈ అభ్యర్థులంతా స్థానికంగా బలమైన నాయకులే అయినా, జాతీయ నాయకులు, అధినాయకత్వం ప్రభావం కూడా ఎన్నికల్లో ప్రధానం కానుంది. వివిధ జాతీయ స్థాయి అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావం చూపనున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు జాతీయ నాయకుల చరిష్మాను, బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం కేసీఆర్ పలుకుబడి కలిసొస్తాయని నమ్ముతున్నారు.

బాన్సువాడ గడ్డ పోచారం అడ్డా..

- 'డబుల్' బిల్లులు చెల్లించకపోతే కుటుంబంతో సహా ధర్నా చేస్తా
- నస్రుల్లాబాద్ కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే పోచారం



నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ/నస్రుల్లాబాద్: 'బాన్సువాడ గడ్డ పోచారం అడ్డా.. నీ పప్పులు ఏం ఉడకవు' అని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం బీర్కూర్, బాన్సువాడలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో, నస్రుల్లాబాద్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడను అభివృద్ధి చేశానన్నారు. అందులో భాగంగా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించానని.. కానీ వాటికి సంబంధించిన రూ. 26 కోట్ల బిల్లులు ఆపేశారన్నారు. 15 రోజుల్లో బిల్లులు చెల్లించకపోతే ఎంతటి త్యాగానికైనా సిద్ధమని, కుటుంబంతో సహా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తానన్నారు. గతంలో నాతో ఓడిన వ్యక్తులు సఖ్యతగానే ఉన్నారని.. కానీ ఎల్లారెడ్డిలో ఓడిన వ్యక్తి బాన్సువాడకు వచ్చి ఏం చేయలేరన్నారు. నిజాంసాగర్ నీటి విడుదలపై నాకు పూర్తిగా అవగాహన ఉందని.. ఎప్పుడు వాడాలో తెలుసు కాబట్టే రాష్ట్రస్థాయిలో మొదట ధాన్యం విక్రయించే ప్రాంతంగా బాన్సువాడ నిలిచిందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే ప్రజా గొంతుకగా పార్లమెంట్‌లో మాట్లాడతానని పేర్కొన్నారు. బోధన్–బీదర్ రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పాల్త్య విఠల్, పార్టీ మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ మాజీద్ ఖాన్, జెడ్పీటీసీ జన్నుబాయి, నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఈవీఎంల కమిషనింగ్



కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను శనివారం కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టారు. ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌లు పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కమిషనింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల పరిశీలకులు ఆదేశించారు. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూం నిర్వహణ వివరాలను ఏఆర్‌వోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రఘునాథరావు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిపై అవగాహన పెంచుకోవాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు గోపాల్ జి తివారి

కామారెడ్డి క్రైం: ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై మైక్రో అబ్జర్వర్లు స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాక్ పోల్ అనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా జరుగుతున్నదీ, లేనిదీ నిశితంగా పరిశీలించాన్నారు. గమనించిన అంశాలను జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకు రావాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పని చేయని ఈవీఎంల స్థానంలో నూతన ఈవీఎంల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిసున్న విధులను గమనించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు.



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు

99 మంది మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ

సమావేశంలో భాగంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియ ఎలా సాగుతున్నదని గమనించడమే మైక్రో అబ్జర్వర్ల పాత్ర అని అన్నారు. జిల్లాలో రిజర్వు సిబ్బందితో కలుపుకొని 99 మంది మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా నిశితంగా పరిశీలించాలన్నారు. ఏదైనా సంఘటన జరిగితే మీ నివేదికలు కీలకమని వివరించారు. 18 అంశాలకు సంబంధించిన నివేదికను ఎప్పటికప్పుడు జనరల్ అబ్జర్వర్‌కు నేరుగా పంపాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, నోడల్ అధికారులు వరదా రెడ్డి, రాజారామ్, రఘునాథ రావు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూం సందర్శన

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి సందర్శించారు. కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన వెబ్ కెమెరాల ద్వారా పరిశీలించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సి–విజిల్ ద్వారా 64 ఫిర్యాదులు అందగా 49 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. 14 తిరస్కరించామన్నారు. 1950 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా 674 ఫోన్ కాల్స్ వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, నోడల్ అధికారులు మురళి కృష్ణ, అంబాజీ, కోటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జోలికొస్తే ఊరుకునేది లేదు

- పరిపాలనా సౌలభ్యం కోసం కామారెడ్డి జిల్లా ఏర్పాటు
- రద్దు చేస్తే కాంగ్రెస్ నేతలను అడుగడుగునా అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జాజాల సురేందర్

సాక్షి, కామారెడ్డి: పరిపాలనా సౌలభ్యం కోసం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కామారెడ్డి జిల్లాను ఏర్పాటు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం జిల్లాను రద్దు చేసి జహీరాబాద్ జిల్లా కేంద్రం చేయాలని కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్‌లు ఆరోపించారు. శనివారం కామారెడ్డిలోని గంప గోవర్ధన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో పోరాడి రాష్ట్రం సాధించుకున్నామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా కలెక్టరేట్, జిల్లా పోలీసు భవనాలు నిర్మించామని, అలాగే జిల్లాలో మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన జిల్లాను తొలగిస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ నేతలను ఊరూరా ప్రజలు అడ్డుకుంటారని హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు మోసపూరిత హామీలు ఇచ్చాయని, వాటిని నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే, హామీలను నెరవేర్చకుండా కాలాయాపన చేస్తూ ప్రజల్ని వంచిస్తున్నారని ఆరోపించారు. పదేళ్ల పాటు కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు, పింఛన్లు ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా ప్రజలకు అందించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్నింటికీ ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు పథకం ఒక్కటే అమలు చేసిందని, ఆర్టీసీకి ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకుండా ఆర్టీసీని దివాలా తీయిస్తోందని ఆరోపించారు. డిసెంబర్ 9న రుణమాఫీ అమలు చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు దేవుళ్ల మీద ప్రమాణం చేస్తూ రైతుల్ని మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం మీద వ్యతిరేకత పెరగడంతో దేవుళ్లపై ఒట్లు పెడుతున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబొద్దీన్ పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా ఎటూ పోదు

- ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్న మాజీ ఎమ్మెల్యే
- ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దయ్యే ప్రశ్నే లేదు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పక్కన ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్

సాక్షి, కామారెడ్డి: అధికారం కోల్పోయి, ప్రజలకు దూరమైన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కామారెడ్డి జిల్లాను రద్దు చేస్తారంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆరోపించారు. జిల్లాను ఎవరు రద్దు చేస్తారు ? ఎందుకు రద్దు చేస్తారని ప్రశ్నించారు. తాను బతికున్నంత వరకు కామారెడ్డి జిల్లా ఉంటుందని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. శనివారం జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌తో కలిసి తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా రద్దవుతుందంటూ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు కాదని స్పష్టం చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తాను సీఎం రేవంత్‌రెడ్డితో నిధులు రాబట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15 లోగా రైతులకు సంబంధించి రూ. 2 లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని సీఎం బహిరంగ సభల్లో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. రైతులు పండించిన పంటలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కరెంట్ కోతలు లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తున్నామని తెలిపారు. కాలేజీ భూములు అమ్ముకున్న వాళ్లు, ఎమ్మెల్సీ టిక్కెట్ అమ్ముకున్న వాళ్లు అవినీతిపై మాట్లాడుతున్నారంటూ ప్రస్తుత ఎమ్మెల్యేపై పరోక్ష విమర్శలు చేశారు.

ప్రియాంక, రేవంత్ పర్యటన వాయిదా

ఈ నెల 6న కామారెడ్డిలో జరగాల్సిన ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధి, సీఎం రేవంత్‌రెడ్డిల పర్యటన అనివార్య కారణాల వలన వాయిదా పడిందని షబ్బీర్ అలీ తెలిపారు. ఈ నెల 9 లేదా 10 తేదీల్లో పర్యటన ఉంటుందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ మాట్లాడుతూ.. పదేళ్లు ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్ చేసిందేమి లేదన్నారు. ఆయన సొంత ఊరికి కూడా రోడ్డు వేయించుకోలేదన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు న్నారు.

క్లుప్తంగా

మామ కోసం కోడలు ప్రచారం



మద్నూర్(జుక్కల్) : మామ గెలుపుకోసం కోడలు ప్రచారం జోరుగా కొనసాగుతోంది. డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపు కోసం ఆయన కోడలు వచన పాటిల్ శనివారం మద్నూర్‌లో మామకు మద్దతుగా ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నేను మీ మండలానికి చెందిన కోడలినని కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఆమె ఓటర్లతో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

28 నుంచి ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు

- ఈనెల 6 వరకు ఫీజు గడువు

కామారెడ్డి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఫస్టియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కామారెడ్డి అభ్యాసక సహాయం కేంద్రం సమన్వయకర్త ఈ.రాజ్‌కుమార్, కార్యాలయ బాధ్యుడు ఎల్. బాపురావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 6వ తేదీలోపు ఫీజు చెల్లించడానికి గడువు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత నెల 31లోగా ప్రవేశాలు పొందిన వారు సైతం ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



కామారెడ్డి క్రైం : అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి మండలం టేక్రియాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న నీటి ట్యాంక్ నిర్మాణం పనులను శనివారం పరిశీలించారు. మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ సాయన్న, ఏఈ సుబ్బారాయుడు, అధికారులు పాల్గొన్నారు.

'ఇంటి వద్దే ఓటు' ప్రారంభం



కోడిచిరలో ఓటు వేసిన వృద్ధురాలు



ఎల్లారెడ్డిలో హోం ఓటింగ్ నమోదుకు వెళ్తున్న అధికారులు

మద్నూర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజికవర్గంలో హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌ను ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అలాగే హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది అన్ని మండలాలకు వెళ్లి 185 మంది నుంచి హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికి పైబడిన దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ మేరకు అధికారులు ఇళ్లకు వెళ్లి ఓటు వేయించారు.

గాంధారి(ఎల్లారెడ్డి) : మండలంలో పలు గ్రామాల్లో 18 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు డీటీ రవికుమార్ తెలిపారు. ఎన్నికల సిబ్బంది శనివారం పలు గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఓట్లు వేయించారు. శనివారం 15 ఓట్లు వేయించినట్లు తెలిపారు. గాంధారిలో-02, దుర్గంలో-04, సోమారం-02, గుజ్జుల్-02, తిప్పారం-02, గండివేట్-01, వెంకటాపూర్-01, సర్వాపూర్‌లో-01 ఓటు వేయించినట్లు తెలిపారు.

ఎల్లారెడ్డి : నియోజకవర్గంలో హోం ఓటింగ్ కోసం 140 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీవో మన్నె ప్రభాకర్ తెలిపారు. హోంఓటింగ్ కోసం రెండు వాహనాలను 4 రూట్లకు కేటాయించడం జరిగిందని, ఈనెల 4, 5వ తేదీల్లో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్తాన్నారు. శనివారం 140 మందికి గాను 72 మంది ఇంటికి వెళ్ళి హోం ఓటింగ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎన్నికల సిబ్బంది తదితరులున్నారు.

నిరంతర విద్యుత్ అందించాలి



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ

బాన్సువాడ : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం అందించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్ బాబు సూచించారు. శనివారం బాన్సువాడ సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగానే, కొత్తవి ఏర్పాటు చేయాలని, సబ్ స్టేషన్‌లో ఫీడర్ల వారిగా విద్యుత్ సరఫరా అవుతున్న క్రమాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో అధిక లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాలని సూచించారు. మే 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో విద్యుత్ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ట్రాన్స్‌కో నోడల్ అధికారి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మాధవ్ రావు, డీఈ కామేశ్వర్‌రావు, డివిజన్ ఇంజినీర్ నాగరాజు, ఏడీఈ శిరీష్, ఏఈలు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

గాంధారి(ఎల్లారెడ్డి) : విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కామారెడ్డి ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్ బాబు, నోడల్ అధికారి క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మాధవ్ అన్నారు. శనివారం మండలంలో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిశీలించారు. ఫీడర్ల వారిగా విద్యుత్తు సరఫరాను పరిశీలించారు. ఈనెల 1వ తేదీ నుంచి కామారెడ్డి జిల్లా విద్యుత్ వారోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగరాజు, ఏఈ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జైళ్ల శాఖ డీఐజీ రాక

కామారెడ్డి అర్బన్ : తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఆదివారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో నిర్వహించే మోగా రక్తదానం శిబిరంలో హైదరాబాద్ రేంజ్ జైళ్లశాఖ డీఐజీ డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. దాతలు 9492874006లో సంప్రదించాలన్నారు.

సదరం క్యాంప్ స్లాట్స్ బుకింగ్ నిలిపివేత

కామారెడ్డి టౌన్ : ప్రతినెల 4వ తేదీన జిల్లాలోని వికలాంగత్వ నిర్ధారణ కోసం ఏర్పాటు చేయబోయే సదరం క్యాంప్‌లకు విడుదల చేయాల్సిన స్లాట్స్ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సాంకేతిపరమైన ఇబ్బందుల వల్ల నిలిపేశామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చందర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో సాంకేతిక సమస్య పరిష్కారమైన పిదప తదుపరి తేదీని తెలియపరుస్తామన్నారు.

ధాన్యం సేకరణ ముమ్మరం చేయాలి

కామారెడ్డి క్రైం: ధాన్యం సేకరణను ముమ్మరం చేయాలని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. శనివారం కామారెడ్డిలోని మార్కెట్ కమిటీ, రామేశ్వర్‌పల్లిలలో కొనుగోలు కేంద్రాలను, క్యాసంపల్లి, ఉగ్రవాయి గ్రామాల్లోని రైస్ మిల్లులను తనిఖీ చేశారు. నిర్వాహకులకు, రైస్‌మిల్లు యజమానులకు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలు పడనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి పూట కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం రాసులు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన టార్పాలిన్లను కేంద్రాల నుంచి తీసుకొని ధాన్యం కుప్పలపై కప్పాలని రైతులకు సూచించారు. రైతులకు వడదెబ్బ తగలకుండా నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 325 కొనుగోలు కేంద్రాల ద్వారా 31,143 మంది రైతుల నుంచి సుమారు రూ. 387 కోట్ల విలువ గల 1,75,644 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ. 277 కోట్లను రైతుల ఖాతాలో జమచేశామని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

రూ.1.47 లక్షల నగదు సీజ్



మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ స్టేజీ వద్ద శనివారం సాయంత్రం పోలీసులు రూ.1,47,600 నగదు సీజ్ చేశారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వస్తున్న టాటా ఏస్ వాహనంలో నగదు పట్టుబడిందని ప్రత్యేకాధికారి విద్యాసాగర్, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశామన్నారు.

అల్ప్రాజోలం పట్టివేత

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డిచ్‌పల్లి మండలంలోని మాధవనగర్ వద్ద యాదాగౌడ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అల్ప్రాజోలం సీజ్ చేసినట్లు తెలిసింది. ఎక్సైజ్ అధికారులు యాదాగౌడ్‌ను విచారించగా, ఓ కల్లు డిపోకు చెందిన ఒకరితోపాటు అల్ప్రాజోలం దందా చేసే మరొకరి పేర్లను చెప్పినట్లు సమాచారం. దీంతో అధికారులు ఆ ఇద్దరి ఇళ్లలో తనిఖీలు చేయగా, వారిపై కేసు కాకుండా డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ అధికారి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాలో అల్ప్రాజోలం, గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాలను అరికట్టే అంశాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్మరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల అదుపులో మత్తుమందు విక్రయ వ్యాపారులు..?

భిక్కనూరు : అల్ప్రాజోలం విక్రయిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారు లో టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా వేసి ఓ కారును పట్టుకున్నారు. కారును తనిఖీ చేసి అల్ప్రాజోలం తరలిస్తున్నట్లు గుర్తించారు. కారులో ఉన్న గాంధారికి చెందిన వ్యక్తి ఒకరు, బాన్సువాడ నుంచి ఒకరు, నిజామాబాద్ లోని ఎడపల్లి ప్రాంతానికి చెందిన ఒకరు, పెద్దమల్లారెడ్డికి చెందిన ఒకరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన అల్ప్రాజోలం విలువ తెలియాల్సి ఉంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో పేకాట స్థావరంపై శనివారం దాడి చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,850 నగదుతోపాటు ఎనిమిది సెల్ ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడిచేసినట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు

ఎడపల్లి(బోధన్): మండలంలోని దుబ్బతండాలో పంచాయతీ కార్యదర్శి సాయికుమార్‌పై దాడి చేసిన ఘటనలో గ్రామానికి చెందిన దేవీసింగ్‌తోపాటు ఆయన భార్య నీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా నల్లా బిగింపు కోసం తాగునీటి పైప్ లైన్‌ను ధ్వంసం చేశారని, ఈ విషయమై ప్రశ్నించగా భార్యాభర్తలు కలిసి కార్యదర్శిపై దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

క్రైం కార్నర్


వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: వడదెబ్బ కారణంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మూడో టైన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. శ్రద్ధానంద్ గంజ్ గేట్-2 వద్ద శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి సమయంలో మృతి చెందాడు. మృతదేహం జీజీహెచ్ మార్చురీలో ఉందని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే డయల్ 100 లేదా టౌన్ సీఐ(87126 59836) లేదా ఎస్సై(87126 59839) నంబర్లను సంప్రదించాలని ఎస్సై ప్రవీణ్ సూచించారు.

అనారోగ్యంతో మాజీ కౌన్సిలర్ ..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని తట్టికోట్ కాలనీకి చెందిన భారతీయ జనతా పార్టీ మాజీ కౌన్సిలర్ బొడ్డు రవి(46)అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందాడని పార్టీ వర్గాలు తెలిపాయి. మృతుడికి భార్య రజిని, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నెల రోజుల క్రితం గుండెపోటు రావడంతో రవి అనారోగ్యానికి గురయ్యాడని నాయకులు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ గ్రామంలోని తన ఇంట్లో గూపన్‌పల్లి ప్రశాంత్ (33) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. ప్రశాంత్‌కు రెండేళ్ల క్రితం వివాహంకాగా, ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి కొన్ని నెలలకే తిరిగి వచ్చాడు. మద్యానికి బానిసై తరచూ గొడవలు జరుగుతుండటంతో భార్య ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యం సేవించడం, అప్పులు పెరిగిపోవడం, భార్య సంసారానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి గూపన్‌పల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో పట్టపగలు చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పట్టపగలు చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే మధుసూదన్ వినాయక్‌నగర్ 100ఫీట్ల రోడ్డులో నివాసం ఉంటున్నాడు. కారు కొనుగోలు చేసేందుకు శుక్రవారం షోరూమ్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉంది. దుండగులు బీరువాను ధ్వంసం చేసి ఎనిమిది తులాల బంగారం, వెండి తదితర వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సేల్స్ టాక్స్ అధికారులమని బెదిరింపులు

- నలుగురు విలేకరుల అరెస్ట్, రిమాండ్

రామారెడ్డి: సేల్స్ టాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులమని చెప్పి ఒకరిని బెదిరించిన నలుగురు విలేకరులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పెర్కిట్ గ్రామానికి చెందిన నిఖిల్ ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్ నుంచి పెర్కిట్‌కు అశోక్ లేలాండ్ వాహనంలో గూడ్స్(సామగ్రి) తీసుకొని వెళ్తుండగా మల్లుపేట్‌శివారులో నలుగురు వ్యక్తులు కారులో వచ్చారు. గూడ్స్ వాహనాన్ని ఆపి తాము సేల్స్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లమని చెప్పి.. వాహనంలోని గూడ్స్‌కు సంబంధించిన పత్రాలు చూపించాలన్నారు. ఈ క్రమంలో రూ.25 వేలు డిమాండ్ చేసి బెదిరించి నిఖిల్ వద్ద నుంచి రూ.3వేల నగదు లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చెన్న మగారి మహేశ్‌గౌడ్, కమ్మరి దత్తాద్రి, బత్తుల రాజేందర్, వేల్పుగొండ ప్రశాంత్‌ను నిందితులుగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ సంతోష్‌గౌడ్, ఎస్సై రాజు, ఏఎస్సై సాగర్, హెచ్‌సీ రామకృష్ణను ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

బిజినెస్ పాటిల్ కాదు.. సేవచేసే పాటిల్‌ను..



మాట్లాడుతున్న బీబీ పాటిల్

ఎల్లారెడ్డి/లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్ : నేను బిజినెస్ పాటిల్‌ను కాదని.. ప్రజలకు సేవ చేసే పాటిల్‌నని జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శనివారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీచౌక్‌లో, లింగంపేట మండలంలోని అంబేడ్కర్ చౌరస్తాలో, నాగిరెడ్డి పేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో బీబీ పాటిల్ మాట్లాడుతూ కొంత మంది తనను బిజినెస్ పాటిల్ అని ఆరోపిస్తున్నారని తాను బిజినెస్ పాటిల్‌ను కాదని, ప్రజలకు సేవ చేసే పాటిల్‌నని అన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కార్పొరేట్ ఎమ్మెల్యే అని ఆరోపించారు. తన హయాంలో సంగారెడ్డి- అకోలా నేషనల్ హైవే పనులు పూర్తి చేయడంతో పాటు, మద్నూర్, రుద్రూర్, మెదక్- ఎల్లారెడ్డి- రుద్రూర్ రోడ్డుకు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. కరీంనగర్-కామారెడ్డి, ఎల్లారెడ్డి రోడ్డు కూడా తాను మంజూరు చేయించానన్నారు. దేశంలో రామరాజ్యం స్థాపన మోదీతోనే సాధ్యమైతుందన్నారు. అబ్‌కీబార్ చార్ సౌ పార్‌లో భాగంగా తనను కూడా గెలిపించాలన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో కేంద్రీయ విద్యాలయం, రైల్వేలైన్, జాతీయ రహదారులు తన హాయంలో చేయించానన్నారు. మూడోసారి మోదీని పీఎంగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి నేరేళ్ళ ఆంజనేయులు, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, పైల కృష్ణారెడ్డి, పైడి ఎల్లారెడ్డిలు ప్రసంగించారు. మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, బీజేపీ నాయకులు దేవేందర్, బాలకిషన్, ఎస్ఎన్‌రెడ్డి, సతీష్, రాజేష్, దత్తురాం, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ హ్యాట్రిక్ పీఎం కావడం పక్కా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 ఎంపీ సీట్లను కైవసం చేసుకుంటుందని మరోసారి మోదీ ప్రధాని అవుతారని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంలోని ఎస్వీ గార్డెన్‌లో జహీరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. అవినీతి అక్రమాలను అరికట్టేందుకు అన్ని గ్రామాల్లో ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయగా 9వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయని, కోడ్ ఉన్నందున ఎన్నికలు అయిపోగానే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని ఆయన అన్నారు. కేంద్ర పథకాలు అన్ని గ్రామాల్లోనూ అమలయ్యాయన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపడ్తామన్నారు. రైతు సేవ కేంద్రాలను, ఆస్పత్రులను, పాఠశాలలను తన సొంతనిధులతో ఏర్పాటు చేసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీ జేపీ మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్, నేతలు బండి రాములు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బస్వారెడ్డి, విపుల్, పైడి రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఎక్‌నాథ్, బాల్‌లింగం, కేవీ. సుబ్బారావు, మస్కట్ భూపాల్‌రెడ్డి తదితరులున్నారు.

కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి

- సామాజిక సమరసత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అప్పాల ప్రసాద్



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్

కామారెడ్డి టౌన్: సమాజంలో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని సామాజిక సమరసత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అప్పాల ప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మశాలలో హిందూ వాహిని ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ్ వార్షికోత్సవ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. హనుమంతుడి గుణగణాలను హిందువులు మనసులో నిలుపుకోవాలని, శ్రీరాముడు చూపించిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, పురాణాలను గ్రంథాలను రామాయణ, మహాభారత, భగవద్గీతలను అధ్యయనం చేయాలన్నారు. ప్రతి శనివారం ధర్మశాలలో జరిగే హనుమాన్ చాలిసా పారాయణం కార్యక్రమానికి హిందువులు రావాలని కోరారు. కార్యక్రమంలో హిందూ వాహిని రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల రాజన్న, జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, పట్టణాధ్యక్షుడు తరుణ్, ప్రతినిధులు జగదీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో దొంగల అలజడి



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కాకతీయనగర్ కాలనీలో దొంగల ముఠా సంచారం కలకలం రేపింది. ఐదుగురు సభ్యులు ఉన్న ముఠా అర్ధరాత్రి వేళల్లో దేవునిపల్లి పరిధిలోని కాకతీయనగర్ లో సంచరిస్తుండగా సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. చెడ్డీలు వేసుకుని వచ్చిన దుండగులు కాలనీలోని పలు ఇళ్లలో చోరీకి ప్రయత్నించారు. దీంతో పట్టణవాసులు ఆందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురి అదృశ్యం

కామారెడ్డి క్రైం: సిరిసిల్ల జిల్లా వీర్నపల్లికి చెందిన ఓ యువతి జిల్లా కేంద్రం నుంచి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 3వ తేదీన కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చిన యువతి, కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకి వెళ్ళిపోయిందన్నారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

భూంపల్లికి చెందిన మహిళ..



గాంధారి(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన సంగజాడ రాజవ్వ అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గాంధారిలో ఉంటున్న తన సోదరుడు సాయిప్రదీప్ వద్దకు గత నెల 30న వచ్చిన రాజవ్వ.. ఈనెల ఒకటో తేదీని స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. ఇప్పటి వరకు రాజవ్వ భూంపల్లికి చేరకపోవడంతో ఆమె కుమారుడు సంగజాడ రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మతిస్థిమితం లేని యువకుడు..



గాంధారి మండల కేంద్రానికి చెందిన యువకుడు జైనపురం వినోద్ అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. మతిస్థిమితం లేని వినోద్ గత నెల 30వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో అతడి సోదరుడు మధుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాలంపాడ్‌కు చెందిన మహిళ..

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలం సాలంపాడ్‌కు చెందిన లక్ష్మి(38) అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. లక్ష్మికి మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహం కాగా, భర్తతో గొడవ కారణంగా ఆమె ఈనెల 2న స్వగ్రామానికి తిరిగివచ్చేసింది. 3వ తేదీన ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ శనివారం తెలిపారు. పూజల అనంతరం శుక్రవారం రాత్రి ఆలయానికి పూజారి తాళం వేసి వెళ్లిపోయారని, శనివారం ఉదయం వచ్చి చూసేసరికి రెండు ద్వారాల తాళలు పగలుగొట్టి ఉన్నాయన్నారు. దుండగులు ఆలయంలోని సామగ్రితో పాటు నగదు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారన్నారు.

హై ఓల్టేజీతో ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేటలో హైఓల్టేజీ కారణంగా శనివారం పలు ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లతోపాటు పలు ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఒక్కసారిగా హైఓల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయి ఆస్తినష్టం సంభవించిందని గ్రామస్తులు తెలిపారు. ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మంటలు వ్యాపించి వరిపంట..

బాల్కొండ: మండలం నాగాపూర్ వరిపంటకు శనివారం నిప్పంటుకుంది. వరి కోత కోసిన తరువాత వ్యవసాయభూమిలోని కొయ్యలకు నిప్పు పెట్టగా మంటలు పక్కనే ఉన్న ఎంబరి మల్లేశ్‌కు చెందిన వరిపొలంలోకి వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎకరం విస్తీర్ణంలో వరి దగ్ధమైంది. సుమారు రూ.70వేల నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు. స్థానిక యువకులు మంటలను ఆర్పేందుకు చాలా శ్రమించారని ఫైర్ హెడ్‌కానిస్టేబుల్ శేఖర్ అన్నారు. పంటపొలాల వద్ద నిప్పు పెట్టొద్దని ఆయన సూచించారు.

రిజర్వేషన్లు ఎత్తేసేందుకు కుట్ర

- ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలి
- టీపీసీసీ ఎస్సీసెల్ రాజ్యాంగ పరిరక్షణ దీక్షలో మాజీ ఎంపీ మధుయాష్కీ
- హాజరైన వీహెచ్, మహేశ్‌గౌడ్, ఎ.చంద్రశేఖర్, ప్రీతమ్, గజ్జెల కాంతం



దీక్షలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లు తీసేసేందుకు జరుగుతున్న కుట్రను అడ్డుకునేందుకు దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ పిలుపునిచ్చారు. టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో రాజ్యాంగ పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఎస్సీ సెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఆ పార్టీ నేతలు గజ్జెల కాంతం, సతీశ్‌మాదిగ, ఊట్ల వరప్రసాద్, మానవతారాయ్ తదితరులు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు హాజరైన యాష్కీ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ ఈసారి బీజేపీకి 400 సీట్లు వస్తే తన ఇష్టానుసారంగా రాజ్యాంగాన్ని మార్చివేస్తుందన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో రిజర్వేషన్లు అమలు కావాలంటే బీజేపీని తరిమికొట్టి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని, అలా తెచ్చే బాధ్యత దళితులపైనే ఉందన్నారు.

రిజర్వేషన్లతోనే సమానత్వం

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు మాట్లాడుతూ సమానత్వం ఉండాలంటే రిజర్వేషన్లు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో బీజేపీతో దోస్తీ కారణంగానే కేసీఆర్ కూడా రాజ్యాంగాన్ని మారుస్తానని అంటున్నారనీ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బీజేపీతో పాటు బీఆర్‌ఎస్‌కు కూడా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల పోటీ..

రెండో స్థానం కోసమే!

▶ మొదటి పేజీ తరువాయి

హామీలను అమలు చేయలేని పరిస్థితుల్లో చెప్పుకోవడానికి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి ఏమీ లేకనే.. రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు, గాడిద గుడ్డు అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడిపై ఒట్లు పెడుతూ దొంగ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ నెల 13న రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉన్న నేపథ్యంలో కిషన్‌రెడ్డి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం, ప్రచార పర్వం, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఇంటర్వ్యూలోని కీలక అంశాలు ఆయన మాటల్లోనే..

బీజేపీకే అనుకూల వాతావరణం

తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు వస్తాయన్న నమ్మకం ఉంది. తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉంది. అసెంబ్లీ ఎన్నికల హామీలను నిలబెట్టుకోకపోవడంతో అధికార కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. పదేళ్ల పాలనలో వైఫల్యాలు, అవినీతి, అక్రమాలు బీఆర్‌ఎస్‌ను వెన్నాడుతున్నాయి. దీంతో మోదీని గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలో 12 స్థానాలకు మించి వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. మేం కచ్చితమైన ఎన్నికల కార్యాచరణతో ముందుకెళుతున్నాం. రాష్ట్రంలోని ఒక్కో ఎంపీ సీటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కమిటీలు, టీమ్‌లు ఏర్పాటు చేశాం. నాయకులంతా సమన్వయంతో పనిచేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నాయకులను ఒక్కో అసెంబ్లీకి పంపించాం. ఇవి లోక్‌సభ ఎన్నికలు కాబట్టి ఇంకా ఏ పార్టీ, ఎంపీ అభ్యర్థులు కూడా పోలింగ్‌బూత్ స్థాయి వరకు చేరుకోలేదు. మేం మాత్రం కచ్చితమైన ప్రణాళికతో బూత్ స్థాయి వరకు ఓటర్లను చేరుకున్నాం.

బీజేపీ బలాన్ని పెంచుకుంటున్నాం..

హైదరాబాద్ నుంచి బరిలో ఉన్న మాధవీలత, ఖమ్మం నుంచి పోటీచేస్తున్న వినోద్‌రావు బీజేపీలో ఉన్నవారే, ప్రజాసంఘాల్లో పనిచేస్తున్నవారే. రాష్ట్రంలో బీజేపీ బలాన్ని పెంచుకునేందుకు కొన్ని సీట్లలో ఇతర పార్టీల వారికి, బలమైన అభ్యర్థులకు టికెట్లు ఇచ్చాం. తెలంగాణలో బీజేపీ ఇంకా చిన్న పార్టీ. పెరగాల్సిన అవసరం ఉంది.

సంకీర్ణమైతే దేశం భ్రష్టుపడుతుంది

రాబోయేది సంకీర్ణ యుగమంటూ మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్.. కాంగ్రెస్ సంకీర్ణంలో చేరుతారా? సమాధానం చెప్పాలి. మేం మాత్రం ఆయనను చేర్చుకునే ప్రసక్తే లేదు. సంకీర్ణమంటే దేశమైనా, రాష్ట్రమైనా భ్రష్టుపడతాయన్న విషయాన్ని అందరూ గ్రహించాలి. ఎవరికి వారు బ్లాక్ మెయిల్ చేస్తారు. ఆ పరిస్థితి పట్ల ప్రజలు విసిగి వేసారాకే.. 2014లో, 2019లో బీజేపీకి మెజారిటీ కట్టబెట్టారు. ఎన్డీయేను అందలం ఎక్కించారు.

ఈసారి గెలిచాక జమిలి ఎన్నికలే..

మోదీ ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టాక.. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ (జమిలి ఎన్నికలు) విధానంతో ముందుకెళతాం. వచ్చే ఎన్నికలు కలిసే జరుగుతాయి. దేశంలో జనగణనతోపాటు నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఇందులో దక్షిణాదిలో సీట్లు తగ్గుతాయంటూ దుష్ప్రచారం చేయడం ఎంతమాత్రం సరికాదు.

సీఎం, మాజీ సీఎం స్థాయివాళ్లు దిగజారి మాట్లాడుతున్నారు!

ప్రస్తుతం రాజకీయ వాతావరణమంతా కలుషితమైపోయింది. గతంలో ఎన్నికలంటే గ్రామాల్లో పండుగ వాతావరణం ఉండేది. ఇప్పుడు అసహ్యించుకునే పరిస్థితి తీసుకొచ్చారు. ఏ మాత్రం సంబంధం లేని విషయాలు ప్రస్తావించడం, అబద్ధాలు మాట్లాడటం, ఉపయోగించే భాషపై నియంత్రణ లేకపోవడం పెరిగింది. కొడతా, తిడుతా, చంపుతా, పాదాల కింద నలిపేస్తా అంటూ సీఎం, మాజీ సీఎం స్థాయిల వ్యక్తులు మాట్లాడుతున్నారు. ప్రచారంలో, మాట్లాడే మాటల్లో నైతికత లేకుండా పోయింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానం సహా అన్నిచోట్లా డబ్బులే కీలకపాత్ర పోషించే పరిస్థితి ఏర్పడింది.

రాముడి పేరిట కాదు.. అభివృద్ధిని చూపి వస్తున్నాం

బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఎక్కడైనా రాముడి ప్రస్తావన ఉందా? మీడియా, వార్తాపత్రికల్లో దీని ప్రాతిపదికన ఎక్కడైనా ఓట్లు అడిగామా? పదేళ్లలో మేం ఎంత అభివృద్ధి చేశాం, ఏయే రంగానికి ఎన్నెన్ని నిధులిచ్చామో స్పష్టంగా చెప్పి ఓట్లు అడుగుతున్నాం. ఎంత మందికి బియ్యం ఇస్తున్నాం, రైతులకు ఏం చేశామనేది చెప్తున్నాం. మేం రాముడి పేరిట ఓట్లు అడుగుతున్నామని విమర్శిస్తున్న వారు దీనికి సమాధానం చెప్పాలి.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

దేశంలో సుస్థిర ప్రభుత్వం రావడం ద్వారా అవినీతి, అక్రమాలకు చెక్‌పెట్టవచ్చు. ఉగ్రవాదాన్ని అరికట్టవచ్చు. అందుకే బీజేపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం. పదేళ్ల మోదీ పాలనలో తెలంగాణకు ఎంతో మేలు జరిగింది. ఇక ముందు మరింత అభివృద్ధి జరగాలంటే బీజేపీని అత్యధిక సీట్లలో గెలిపించాలని కోరుతున్నాను.

రేవంత్‌కు ముందుంది ముసళ్ల పండుగ

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారు. అమలు చేయలేదు. అందుకే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డికి ఓట్లు అడిగే నైతికహక్కు లేదంటున్నాం. మా ఇంటింటి ప్రచారంలో ఈ విషయాన్ని ప్రజలకు చెప్తుంటే మంచి స్పందన వస్తోంది. రేవంత్‌రెడ్డికి ముందుంది ముసళ్ల పండుగ. ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాల అమలు ఎలా చేస్తారు? ఇప్పుడు తొందరపడి ఎగిరెగిరి పడితే సరిపోతుందా? భూములు అమ్మి ఎన్ని లక్షల కోట్లు సంపాదిస్తారు? ఏం చేస్తారనేది ప్రజల ముందు ఉంది. కాంగ్రెస్ పార్టీ 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో మరీ దారుణంగా వ్యవహరిస్తోంది.

రిజర్వేషన్లపై మోదీ స్పష్టత ఇచ్చినా.. రేవంత్ గోబెల్స్ ప్రచారం

ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని మేం 20 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. అది మా పార్టీ విధానమని స్పష్టంగా చెప్తున్నాం. మోదీ ప్రధాని అయ్యాక కొత్తగా ఏమీ దీనిని లేవనెత్తలేదు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టులు కూడా తీర్పులిచ్చాయి. కానీ విపక్షాలు కావాలని బురద చల్లుతున్నాయి. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున గోబెల్స్ ప్రచారానికి దిగాయి. దీనిపై ప్రధాని మోదీ చాలా స్పష్టమైన ప్రకటన చేశారు. తన కంఠంలో ప్రాణం ఉండగా రిజర్వేషన్ల రద్దు ఉండదని, రాజ్యాంగాన్ని మరింత పటిష్టం చేస్తామని చెప్పారు. అయినా బీజేపీపై దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూ.. దాన్ని ఎన్నికల ఎజెండాగా తయారుచేసి పెట్టారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. అందుకే మేం పదే పదే వివరణ ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నాయి. ఇది మాదిగలకు అనుకూలం, మాలలకు వ్యతిరేకమనే ఆలోచన తప్పు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల ఫలాలు అందాలని కోరుకుంటున్నాం.

ఆదాయం రూ.6 వేలు.. ఖర్చు 2 లక్షలు!

ఆదరణ కరువైన సిద్దిపేట-సికింద్రాబాద్ రైలు

- రోజుకు సగటున 250 మంది మాత్రమే ప్రయాణం
- ప్రస్తుతం కేవలం 40 కి.మీ వేగంతో నడుస్తున్న రైలు
- మూడుచోట్ల కొనసాగుతున్న వంతెనల పనులే కారణం
- బస్సు కన్నా గంటకు పైగా ఎక్కువ ప్రయాణ సమయంతో ఆసక్తి చూపించని ప్రజలు

సాక్షి, హైదరాబాద్: ఆ రైలు రోజుకు రెండు ట్రిప్పులు తిరుగుతోంది. ఆ రెండు ట్రిప్పుల్లోనూ అందులో ప్రయాణించే వారి సంఖ్య సగటున 250 మంది మాత్రమే. కాగా టికెట్ల రూపంలో రైల్వేకు రోజుకు వస్తున్న ఆదాయం కేవలం సుమారు రూ.6 వేలు. కానీ ఈ రెండు ట్రిప్పులకు అయ్యే నిర్వహణ వ్యయం ఎంతో తెలుసా? ఏకంగా రూ.2 లక్షలు! సికింద్రాబాద్ - సిద్దిపేట మధ్య తిరుగుతున్న డెమూ రైలు కథ ఇది. పరుగులు పెట్టాల్సిన ఈ రైలు షెడ్యూల్ ప్రకారం గానే అయినా దాదాపు నడుస్తున్నట్టు వెళ్లడమే ఈ పరిస్థితికి కారణం. నగరంలోని జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరే బస్సు 2.15 గంటల్లో సిద్దిపేటకు చేరుకుంటుంటే, ఈ రైల్లో మాత్రం ఇందుకోసం కనీసం 3 గంటల నుంచి మూడున్నర గంటల సేపు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ రైలు సగటు వేగాన్ని అధికారులు గంటకు కేవలం 40 కిలోమీటర్లకే పరిమితం చేశారు. అందుకనే 116 కి.మీ (రైలు రూట్ కి.మీ. ప్రకారం) ప్రయాణానికి 3 గంటలకు పైగా సమయం పడుతోంది. మరోవైపు స్టేషన్ సిద్దిపేటకు దూరంగా ఉంది. దీంతో సిద్దిపేట నుంచి స్టేషన్‌కు రావాలన్నా, స్టేషన్ నుంచి సిద్దిపేటకు వెళ్లాలన్నా ప్రత్యేకంగా ఆటోలో ప్రయాణించాల్సి వస్తోంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు రైలు ఎక్కడం కంటే బస్సు బెటరని అటు మళ్లుతున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో కొనసాగింపు

రెండు ట్రిప్పుల్లో సగటున నాలుగైదు వేల మంది ప్రయాణించాల్సి ఉండగా 250 కూడా మించటం లేదు. సిద్దిపేటలో 30 మందికి మించి రైలు ఎక్కడం లేదు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరి సిద్దిపేట చేరుకునే సరికి అంతే సంఖ్యలో ప్రయాణికులు మిగులుతున్నారు. మధ్యలో ఉండే స్టేషన్లలో ఐదారుగురు చొప్పున ఎక్కి దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో రైల్లో 50-60 మంది ప్రయాణికులు కూడా ఉండటం లేదని సిబ్బంది చెప్పడటం ఈ రైలుకున్న ఆదరణను స్పష్టం చేస్తోంది. ఇలాంటప్పుడు రైల్వే దీనిని డిమాండ్ లేని సర్వీసుగా పరిగణించి రద్దు చేస్తుంది. కానీ భవిష్యత్తులో ఇది కరీంనగర్ (పెద్దపల్లి) వరకు సేవలు అందించాల్సిన సర్వీసు కావటంతో, ఇప్పుడు రద్దు చేస్తే మళ్లీ పునరుద్ధరించేందుకు రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీ, తదనంతర అనుమతులు రావడం లాంటి తతంగం ఉన్నందున తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రైలును కొనసాగిస్తోంది.

ఎందుకింత మెల్లగా..

మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు మార్గం సిద్ధం కావటంతో రైలు ప్రారంభించారు. కానీ మధ్యలో మూడు నాలుగు చోట్ల ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సిద్దిపేట-జనగామ రోడ్డులో రంగధామపల్లి వద్ద ఆర్‌ఓబీ నిర్మాణం జరుగుతోంది. కొమురవెల్లి స్టేషన్ సమీపంలో ఆర్‌యూబీ నిర్మాణం కొనసాగుతోంది. కుకునూరుపల్లి వద్ద ఆర్‌ఓబీ ఇటీవలే పూర్తయింది. ఈ మూడు కీలక నిర్మాణాల కారణంగానే వేగాన్ని బాగా తగ్గించి రైలు నడుపుతున్నారు.

రోజుకు 1,800 లీటర్ల డీజిల్ ఖర్చు

ఇది ఎనిమిది కోచ్‌లుగా ఉండే రేక్. దీనికి రెండు పవర్ కార్‌లుంటాయి. ఒక్కో పవర్ కార్‌కు నాలుగు కోచ్‌లు అటాచ్ అయి ఉంటాయి. ఒక ట్రిప్పునకు (వెళ్లి రావడానికి) 900 లీటర్ల డీజిల్ ఖర్చవుతోంది. రెండు ట్రిప్పులకు 1800 లీటర్లు ఖర్చవుతున్నాయి. ఇక ఈ సర్వీసు సిబ్బందికి ఒకరోజు జీతం రూ.20 వేలుగా ఉంటోంది. ఈ మొత్తం కలిపితే రోజుకు రూ.2 లక్షల ఖర్చవుతోంది.

ఆ దారి బాగు చేయండి

సిద్దిపేట, రైల్వేస్టేషన్‌కు మధ్య (ప్రధాన రహదారి) దాదాపు నాలుగు కి.మీ.దూరం ఉండటం ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. గుండ్ల చెరువు మీదుగా వెళ్తే ఒకటిన్నర కి.మీ.దూరమే ఉంటుందని, కానీ ఆ దారి మధ్యలో ధ్వంసం కావటంతో వాహనాల రాకపోకలు కుదరటం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ దారి బాగు చేస్తే తమకు కొంతవరకు సౌకర్యవంతంగా ఉంటుందని అంటున్నారు.

75 కిలోమీటర్లకు పెరగనున్న వేగం

ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల పనులను త్వరగా పూర్తి చేసి రైలు వేగాన్ని పెంచాలని ఇటీవల రైల్వే ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో రైలు గరిష్ట వేగాన్ని 75 కి.మీ.కు పెంచాలని నిర్ణయించారు. అదే జరిగితే ప్రయాణ సమయం దాదాపు 45 నిమిషాలు తగ్గుతుంది. అప్పుడు రెండున్నర గంటల్లోనే రైలు గమ్యం చేరుతుందని, ప్రయాణికుల ఆదరణ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

రైలు వేళలు ఇలా..

- → సిద్దిపేటలో ఉదయం 6.45 గంటలకు బయలుదేరి 10.15కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. → సికింద్రాబాద్‌లో ఉదయం 10.35కు బయలుదేరి మధ్యాహ్నం 1.45కు సిద్దిపేట చేరుకుంటుంది.
- → సిద్దిపేటలో 2.05కు బయలుదేరి సిక్రింద్రాబాద్‌కు సాయంత్రం 5.20కు చేరుకుంటుంది.
- → సికింద్రాబాద్‌లో.5.45కు బయలుదేరి రాత్రి 8.45కు సిద్దిపేటకు చేరుకుంటుంది.
- → మల్కాజిగిరి, కెవలరీ బ్యారక్స్, బొల్లారం, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, మనోహరాబాద్, నాచారం, బేగంపేట, గజ్వేల్, కొడకండ్ల, లకుడారం, దుద్దెడల్లో ఆగుతుంది.

సమాచారానికి 'సహకారం' కరువు

ప్రజలకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పిన స.హ చట్టం రెండు దశాబ్దాలుగా ఎన్నో అక్రమాలను బయట పెట్టింది. కానీ ఇది నాణేనికి ఒక పార్శ్వం మాత్రమే. చట్టం వచ్చి 19 ఏళ్లు అవుతున్నా అధికారులు తమ లోపాలను కప్పిపుచ్చుకునేందుకు చట్టానికి యథేచ్ఛగా తూట్లు పొడుస్తున్నారు. జిల్లాలోని కొన్ని కార్యాలయాల్లో పెద్ద మొత్తంలో రుసుములు చెల్లించాలంటూ హుకూం జారీ చేస్తున్నారు. కొందరు అధికారులైతే స.హ చట్టం నిబంధనలు తెలియనట్లు ప్రవర్తిస్తూ సహాయ నిరాకరణ చేస్తున్నారు.

- అందని సమాచారం.. పట్టని నిబంధనలు
- అధిక రుసుములు వసూలు చేస్తున్న అధికారులు
- స.హ. చట్టం స్ఫూర్తికి తూట్లు

కమ్మర్‌పల్లి: స.హ చట్టం సెక్షన్-7 ప్రకారం దరఖాస్తుదారుడు నిర్ణీత కాలంలో సమాచారం తీసుకోవడానికి కొంత రుసుములు చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. సెక్షన్-8, 9 ప్రకారం దేశ ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినకుండా ఎటువంటి సమాచారం అయినా రుసుములు చెల్లించి తీసుకోవాలి. ఉత్తర్వు నంబర్ 740, 454 ప్రకారం సమాచారం ఇవ్వాల్సిన ప్రజా సమాచార అధికారులు ఏ-4 లేదా ఏ-3 పరిమాణం గల కాగితానికి రూ. 2 చొప్పున తీసుకోవాలి. సమాచారం ఎక్కువగా ఉంటే సీడీ, డీవీడీ లేదా ఫ్లాపీ రూపంలో సమాచారాన్ని తీసుకోవచ్చు. ఒక సీడీకి రూ.100, డీవీడీకైతే రూ.200, ఫ్లాపీకైతే రూ.50 చెల్లించి తీసుకోవాలి.

- కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఒక దరఖాస్తుదారుడు సమాచార హక్కు(స.హ) చట్టం-2005 కింద మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల ఆదాయ, వ్యయాలు కోరుతూ మండల పరిషత్ కార్యాలయానికి దరఖాస్తు చేశారు. బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, సమాచారానికి సంబంధించి 7146 పేజీలు ఉన్నాయి.. పేజీకి రూ. 3 చొప్పున రూ. 21,438 చెల్లించాలని దరఖాస్తుదారుడికి లేఖ ద్వారా సమాచారం ఇచ్చారు. అంతేకాక ఇదే మాదిరిగా మిగతా పంచాయతీల కార్యదర్శులు కూడా సమాచార పేజీలకు సంబంధించి పేజీకి రూ. 3 చొప్పున చెల్లించాలని తమ లేఖల ద్వారా సమాచారం అందించారు.

- ఆలూర్ మండలం దేగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి స.హ చట్టం కింద దరఖాస్తు చేస్తూ తాను చేసిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలు తెలపాలని కోరగా.. సదరు పీఐవో సమాచారం ఇవ్వలేదు. మొదటి అప్పీల్ వేసినా స్పందించడం లేదు.

RIGHT TO INFORMATION

కానీ 4(1)-బి రూపంలో ఉన్న 17 అంశాల సమాచారం మాత్రం దరఖాస్తుదారుడికి ఉచితంగా ఇవ్వాలి. సహజంగా దరఖాస్తుదారులు కోరే సమాచారంలో 90 శాతం 4(1)-బి కి సంబంధించిన సమాచారమే ఉంటుంది. కానీ ఎక్కువ మొత్తంలో రుసుములు అడుగుతూ కొందరు అధికారులు స.హ చట్టం స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు.

అధికారులే అడ్డు గోడలు...

ఉమ్మడి జిల్లాలో పౌరులు కోరిన సమాచారం ఇవ్వకుండా తప్పించుకోవడానికి స.హ చట్టం ఉత్తర్వు నంబర్ -740, సెక్షన్-7ను ఆయుధంగా చేసుకొని అధిక రుసుం వసూలు పేరుతో స.హ చట్టానికే మస్కా కొడుతున్నారు. స.హ చట్టం సెక్షన్-6(1) ప్రకారం ఒక ప్రభుత్వ కార్యాలయంలో దరఖాస్తు చేస్తే 30 రోజుల్లో సమాచారం ఇవ్వడం గగనంగా మారింది. సాధారణ సమాచారం అయితే ఇస్తున్నారు కానీ, అవినీతితో ముడిపడిన సమాచారం గానీ, లోపాలు గల సమాచారం ఇవ్వడానికి అధికారులు రుసుముల పేరుతో కొత్త ఎత్తుగడ అనుసరిస్తున్నారు. అధిక రుసుములపై సమాచార కమిషన్‌కు సెక్షన్-18(1) దరఖాస్తుదారులు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ, ఆ అప్పీల్ విచారణకు రావడానికి రెండేళ్లు సమయం పడుతోంది. ఈ దశలో దరఖాస్తుదారులు ఏమి చేయాలో తెలియక మిన్నకుండిపోతున్నారు.



దరఖాస్తుదారుడికి బషీరాబాద్ పంచాయతీ కార్యదర్శి పంపిన లేఖ

- జిల్లాలో ప్రతి ఏడాది ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న దరఖాస్తుల సంఖ్య 2500-3000
- మొదటి అప్పీల్‌కు వెళ్తున్నవి 1800
- రెండవ అప్పీల్‌కు వెళ్తున్నవి 950

నిబంధనలకు విరుద్ధం



స.హ చట్టం సెక్షన్-7, సాధారణ పరిపాలన శాఖ 2005లో వెలువరించిన ఉత్తర్వు నంబర్-740 వసూలు చేయాల్సిన రుసుముల గురించి తెలియజేస్తుంది. వీటిపై అధికారులు అవగాహన పెంచుకోవాలే గానీ, నిబంధనలకు విరుద్ధంగా అధిక రుసుములు వసూలు చేస్తూ స.హ చట్టానికి తూట్లు పొడవద్దు. స.హ చట్టాన్ని పక్కాగా అమలు పరిచి సామాన్య పౌరులకు సమాచారం ఇవ్వాలి.

– అంకం నరేష్, స.హ. చట్టం పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు

తప్పుడు సమాచారం ఇచ్చారు

- జిల్లా వైద్యశాఖ అధికారుల నిర్వాకం
- ఆర్టీఐ దరఖాస్తుదారు ఆవేదన

నిజామాబాద్‌నాగారం : సమాచార హక్కు చట్టానికి డీఎంహెచ్‌వో అధికారులు తూట్లు పొడిచారు. పైగా సమాచారం అడిగిన దరఖాస్తుదారుకు బెదిరింపులు.. దీంతో హైద్రాబాద్ ఆర్‌టీఐ హైదరాబాద్ కమిషనర్ ఆఫీసులో గత డీఎంహెచ్‌వో అధికారిపై కేసు నమోదు. వివరాలు ఇలా ఉన్నాయి.

డిచ్‌పల్లి మండలంలోని మిట్టాపల్లి గ్రామానికి చెందిన సమీర్ హైమాద్ 2022 నవంబర్ 23న జిల్లా వైద్యారోగ్యశాఖలో ఆర్‌టీఐ యాక్టు ద్వారా అద్దెవాహనాల వివరాలు ఇవ్వాలని కోరారు. ఇందులో 2019 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు అద్దె వాహనాలు ఎన్ని ఉన్నాయి? ఆర్‌బీఎస్‌కే, ఆల్ ప్రోగ్రామ్ ఆఫీసర్, టీ హబ్‌లో ఉన్న అద్దె వాహనాలకు సంబంధించి లాగ్‌బుక్, అకౌంట్స్, ట్యాక్సీ ప్లేట్ నంబర్, ఆర్‌సీబుక్ జిరాక్సు కాపీలను కోరారు. అధికారులు 30 రోజుల్లో వివరాలు అందించాల్సి ఉండగా ఏడాది గడిచిపోయినా నిర్లక్ష్యం వహించారు. దీంతో సమీర్ నేరుగా హైదరాబాద్ కమిషనర్ ఆఫీసులో 2023 జనవరి 20న ఫిర్యాదు చేశారు. తాజాగా దరఖాస్తుదారుకు డీఎంహెచ్‌వో అధికారులు 2024 ఏప్రిల్ 10న తప్పుడు సమాచారం ఇచ్చారు. తనను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని సమీర్ పేర్కొన్నారు. ఆర్‌బీఎస్‌కే జీవో కాపీలతో పాటు, వాహనాల నంబర్లు మాత్రమే ఇచ్చారని, ఇందులో టీ హబ్ వివరాలు ఇవ్వలేదన్నారు. ఈ మేరకు హైదరాబాద్ ఆర్‌టీఐ కమిషనర్ ఆఫీసులో ఫిర్యాదు చేయగా అప్పటి జిల్లా డీఎంహెచ్‌వో అధికారిపై కేసు నమోదు చేశారని సమీర్ తెలిపారు. ఈ సందర్భంగా తనను అధికారులు బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తాను మళ్లీ హైదరాబాద్ కమిషనర్ ఆఫీసుతో పాటు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని,. తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకునే వరకు పోరాడుతానన్నారు.

పడిపోయిన టమాట ధర

మోర్తాడ్(బాల్కొండ): టమాట సాగు చేసిన రైతులు ధర దక్కక ఆందోళన చెందుతున్నారు. నిన్నటి వరకు ఒక పెట్టి టమాటకు రూ.200 వరకు అందుకున్న రైతులు ఇప్పుడు రూ.100తోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. రిటేల్ మార్కెట్‌లో కిలో టమాట ధర రూ.20 పలుకుతున్నా హోల్‌సెల్ వ్యాపారులకు విక్రయించిన పంటకు కిలోకు రూ.5 మాత్రమే అందుకుంటున్నారు. ఒక పెట్టెలో 20 కిలోల టమాటలు పడతాయి. మోర్తాడ్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, ఆర్మూర్, బాల్కొండ, నందిపేట్, మాక్లూర్, ముప్కాల్, మెండోరా, జక్రాన్‌పల్లి మండలాల్లో టమాటను విస్తారంగా సాగు చేశారు. ఎగుమతులకు ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతోనే టమాట ధర పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే మహారాష్ట్ర నుంచి టమాట దిగుమతి అవుతుండటంతో ఇక్కడి పంటకు ధర ఆశించిన విధంగా లభించడం లేదని తెలుస్తోంది. ఒక్కో సందర్భంలో టమాట పండించిన రైతులు ఒక ఎకరానికే రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తే ఇప్పుడు కనీసం కూలి సొమ్ముకు సమానంగా ఆదాయం రావడం లేదు.

మండుటెండలో..



ఎండలు రోజురోజుకు ముదిరిపోతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోతున్నాయి. అయితే పిట్లం మండలంలోని సిద్దాపూర్ సమీపంలో పిట్లం-బాన్సువాడ ప్రధాన రహదారి పక్కన గల చెరువు నీటితో నిండుకుండలా ఉంది. చెరువులో అక్కడక్కడా కలువ పువ్వులు, నీటిపై మొత్తం కలువ ఆకులు పరుచుకుపోయి చూపరులను ఆకట్టుకుంటోంది.

– మద్నూర్ (జుక్కల్)

65 ఏళ్లు నిండితే ఉద్యోగ విరమణే..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు మెడికల్ టెస్టులు ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగ విరమణకు రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్ల వయస్సును నిర్ధారించింది. ఈ వయస్సు దాటిన వారు ఖచ్చితంగా ఉద్యోగ విరమణ చేయాల్సిందేనని ఆదేశాలు సైతం జారీ చేసింది. జిల్లాలో ఇప్పటికే 65 ఏళ్లు దాటిన వారు 250 మంది ఉన్నారని అధికారుల అంచనా. అయితే కొంత మంది తమ వయస్సు ధ్రువీకరణ పత్రాల్లో పుట్టిన తేదీలు మార్చుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం మెడికల్ టెస్టులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది.

జిల్లాలో నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, భీమ్‌గల్, ఆర్మూర్ ప్రాజెక్టు కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో 1500 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో చిన్నారులు 80,747, గర్భిణులు 1134, బాలింతలు 10260 మంది ఉన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 120కుపైగా టీచర్లు, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో వీటిని భర్తీ చేస్తామని చెప్పినా ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్లు నిండిన వారికి ఉద్యోగ విరమణ వయస్సును ప్రకటించగా జిల్లాలో సుమారు 250మంది టీచర్లు, ఆయాలు ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది.

సర్టిఫికెట్లలో మార్పులు.. చేర్పులు

65 ఏళ్లు నిండిన ఆయాలు, టీచర్లు తమ వయస్సు ధ్రువీకరణ పత్రాల్లో పుట్టిన తేదీలను మార్పులు చేర్పులు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. వీరి కోసం ప్రభుత్వం మెడికల్ టెస్ట్ నిర్వహించారు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు బెనిఫిట్స్‌లో అన్యాయం జరుగుతోందని గత ప్రభుత్వానికి వీరు విన్నవిస్తే రిటైర్‌మెంట్ తర్వాత రూ. 50వేలు ఆయాలకు, టీచర్లకు రూ. 1లక్ష ఇస్తామని చెప్పింది. కానీ టీచర్లకు రూ.5లక్షలు, ఆయాలకు రూ. 3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



జాబితా సిద్ధం

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు మరో మూడు రోజుల్లో మెడికల్ పరీక్షలు నిర్వహించేందుకు ఐసీడీఎస్ అధికారులు సిద్ధమయ్యారు. ఆధార్‌కార్డులతో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తూ, మెడికల్ పరీక్షలు చేయనున్నారు. ఈ పరీక్షలతో వయస్సు ఎంతో ఉందో తేలనుంది. అప్పుడే పూర్తిస్థాయి జాబితాను సిద్ధమని అధికారులు పేర్కొంటున్నారు.

వైద్య పరీక్షలు చేస్తాం

జిల్లాలో ఉద్యోగ విరమణ వయస్సుకు దగ్గరలో ఉన్న ఆయాలు, టీచర్లకు డాక్టర్ల ద్వారానే మెడికల్ పరీక్షలు చేస్తాం. దాంతో వారి వయస్సు ఎంత ఉందో తెలుస్తుంది. ఇప్పటికే ఏర్పాట్లు చేశాం. మరో మూడు రోజుల్లో మెడికల్ పరీక్షలు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– రసూల్‌బీ, జిల్లా మహిళా సంక్షేమాధికారి